
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



3 కర్నూలు జిల్లా వార్తలు

బుధవారం 17 ఏప్రిల్ 2024




రోడ్‌షోలో బాలకృష్ణ, తిక్కారెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బస్తిపాటి నాగరాజు, జయనాగేశ్వర రెడ్డి





# జగన్ నయవంచకుడు

- మళ్లీ అధికారంలోకి వస్తే ఊళ్లు, ఆస్తులు వదిలి వెళ్లాల్సిందే
- విజనరీ చంద్రబాబు వల్లే నవ్యాంధ్ర ప్రగతి
- వైసీపీని తరిమేసేందుకు ప్రజలు సిద్ధం కావాలి
- ఎమ్మిగనూరు, కోసిగి రోడ్‌షోల్లో బాలకృష్ణ పిలుపు

**కర్నూలు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి)/ఎమ్మిగనూరు/కోసిగి:** జాబ్‌క్యాలెండర్ అని, సీపీఎస్ రద్దని, మద్యపాన నిషేధమని ప్రజలను మోసం చేసిన నయ వంచకుడు జగన్ అంటూ ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ధ్వజమెత్తారు. స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా మంగళవారం ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో పర్యటించారు. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం కర్నూలు నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించి అక్కడే బస చేశారు. మంగళవారం సాయంత్రం 4గంటలకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం టీడీపీ అభ్యర్థి మాధవరం ఎన్.రాఘవేంద్రరెడ్డి, కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించారు. గోనెగండ్ల మండలం వేముగోడు, హెచ్‌కైరవాడి, గోనెగండ్ల మీదుగా ఎమ్మిగనూరుకు చేరుకున్నారు. శివ సర్కిల్‌లో జరిగిన సభలో మాట్లాడారు. అక్కడి నుంచి పట్టణ వీధుల గుండా ముగతి, హాలహర్వి దాటి మంత్రాలయం నియోజకవర్గంలో అడుగుపెట్టారు. కల్లుదేవకుంట, మంత్రాలయం, మాలపల్లి, మాధవరం మీదుగా కోసిగికి చేరుకున్నారు. రాత్రి కోసిగిలో జరిగిన సభలో బాలకృష్ణ మాట్లాడారు. ఏ పల్లెకు వెళ్లినా తమ అభిమాన నటుడు, తెలుగుదేశం నాయకుడు బాలకృష్ణ రాక కోసం గంటలు తరబడి యువకులు, మహిళలు, రైతులు ఎదురు చూశారు. బాలకృష్ణ రాగానే జై బాలయ్య అంటూ హోరెత్తించారు. జనసేన, బీజేపీ కార్యకర్తలు సైతం బాలకృష్ణ యాత్రలో పాల్గొన్నారు.



యువతలో ఉరకలెత్తిన ఉత్సాహం

### జగన్‌కు ఓటు వేస్తే దొంగచేతికి తాళం ఇచ్చినట్లే..

జగన్‌కు ఓటు వేస్తే దొంగ చేతికి తాళం ఇచ్చినట్లేనని బాలకృష్ణ అన్నారు. రాష్ట్రానికి పట్టిన శని జగన్ అని విమర్శించారు. సిద్ధం.. సిద్ధం అంటున్న జగన్ దేనికి సిద్ధమో చెప్పాలన్నారు. ఈ రాష్ట్రాన్ని మళ్లీ అప్పుల పాలు చేయడానికి సిద్ధమా..?దళితులు, మైనార్టీలపై దాడులు చేయడానికి సిద్ధమా..? ప్రజల ఆస్తులను అప్పుల కోసం తాకట్టుపెట్టేందుకు సిద్ధమా..? దేనికి సిద్ధం జగన్ అంటూ ప్రశ్నించాడు. ప్రజలు జగన్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని దుయ్యబట్టారు. సంక్షేమానికి పునాది వేసిందే ఎన్టీఆర్ అని అన్నారు. విజనరీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమంతోపాటు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఐటీ విప్లవం తెచ్చిన గొప్ప వ్యక్తి చంద్రబాబు అంటూ కీర్తించారు.

### చేనేతలకు టెక్స్‌టైల్ పార్కు ఇస్తే రియల్ వ్యాపారమా..?

ఎమ్మిగనూరులో అత్యధికంగా ఉన్న చేనేతలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బనవాసి ఫారం వద్ద వంద ఎకరాల్లో గత టీడీపీ ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసిందని అన్నారు. వైసీపీ వచ్చాక టెక్స్‌టైల్ పార్కు రద్దు చేసి ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని విమర్శించారు. రూ.1986 కోట్లతో ఆర్డీఎస్ ప్రాజెక్టును తెస్తే వైసీపీ ప్రభుత్వం ఆపేసిందని, ఎమ్మిగనూరుకు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని రూ.145 కోట్లతో గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ తెస్తే జగన్ ఆపేశారని పేర్కొన్నారు. వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకా సౌమ్యురాలు.. పేదరాలు అంటూ జగన్ చెప్పారని, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ.360 కోట్లు అప్పు తీసుకొని ఎగ్గొట్టిన బుట్టా రేణుకా పేదరాలు.. సౌమ్యురాలా అని ప్రశ్నించారు.



మిద్దెలెక్కిన అభిమానం



బాలయ్య కోసం..





అభిమానుల కోలాహలం.. బాలయ్య అభివాదం



కోసిగిలో బాలయ్య రోడ్ షోకు తరలివచ్చిన ప్రజలు





## జగమంతా రామమయం..!

- నేడు శ్రీరామనవమి
- వైష్ణవ దేవాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు



**కర్నూలు (కల్చరల్), ఏప్రిల్ 16:** శ్రీరాముని జన్మదిన వేడుక 'శ్రీరామనవమి'ని బుధవారం ఉమ్మడి జిల్లాలో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని వైష్ణవ ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కల్యాణ వేడుకలకు ఆలయాల కమిటీల నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల కోసం చలువ పందిళ్లు నిర్మించారు. తీర్థ, ప్రసాదాల పంపిణీకి క్యూలైన్లు సిద్ధం చేశారు. వేసవిలో దాహార్తి తీర్చేందుకు మంచినీటి వసతి కల్పించారు. జిల్లాలో ఏటా సీతారాముల కల్యాణ వేడుకలు వైభవోపేతంగా నిర్వహిస్తుండగా, ఈ ఏడాది గ్రీష్మతాపం ఎక్కువగా ఉన్నా ఉత్సవాలకు ఎలాంటి లోటు లేకుండా ఘనంగా నిర్వహించనున్నారు.

### నగరంలోని ఆలయాల్లో కల్యాణ వేడుకలు

నగరంలోని వైష్ణవ ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆయా ఆలయాల్లోని ఉత్సవ మూర్తులను కల్యాణానికి సిద్ధం చేశారు. పెద్ద పెద్ద పందిళ్లు వేసి, వాటి కింద కల్యాణ వేదికలు నిర్మించారు. భక్తులు ఈ వేడుకలు వీక్షించేందుకు జంపకానాలు వేశారు. మంచినీటి సౌకర్యం కల్పించారు. నగరంలో అతి పురాతన దేవాలయం శ్రీరాంబొట్ల దేవాలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ నగరూరు దీప్తి ఆధ్వర్యంలో కల్యాణ వేడుకల ఏర్పాట్లు పూర్తి చేశారు. పాతనగరంలోని శ్రీరామాలయం, కొత్తపేటలోని కోదండ రామస్వామి దేవాలయంలో కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త ఈ. మల్లికార్జునరెడ్డి తెలిపారు. నగరంలోని బళ్లారి చౌరస్తాలోని హనుమాన్ దేవాలయంలో, వీఆర్ కాలనీలోగల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, బాహూజీనగర్‌లోని కోదండ రామాలయంలో, మాధవీనగర్‌లోని శివరామాలయంలో, అశోకనగర్‌లోని హనుమాన్, సాయిబాబా దేవాలయంతోపాటు వివిధ ప్రాంతాల్లోగల హనుమాన్ దేవాలయాల్లో కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్నారు.



కల్యాణ వేడుకలకు సిద్ధమైన పాతనగరంలోని రాంబొట్ల దేవాలయం

## ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిపై బాలకృష్ణ ఫైర్

**కోసిగి, ఏప్రిల్ 16:** : కోసిగిలో జరిగిన రోడ్‌షోలో మంత్రాలయం ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి వై.బాలనాగిరెడ్డిపై నందమూరి బాలకృష్ణ విరుచుకుపడ్డారు. బాలనాగిరెడ్డి, ఆయన అనుచరులు రాత్రి 9 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు తుంగభద్ర నదిలో ఇసుకను పక్క రాష్ట్రాలకు అమ్మి కోట్లు సంపాదిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారన్నారు. కర్ణాటక నుంచి మద్యాన్ని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. కల్తీ మద్యం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలను తీసుకుంటున్నారనీ బాలకృష్ణ ఆరోపించారు. రేషన్ బియ్యం పక్క రాష్ట్రాలకు తరలిస్తూ కోట్లు సంపాదిస్తున్నాడన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి చేయకుండా అక్రమాలకు పాల్పడుతూ నియోజకవర్గ ప్రజలను మోసం చేశాడని బాలనాగిరెడ్డిపై ధ్వజమెత్తారు. ఈసారి టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డిని గెలిపించుకోవాలన్నారు.





మాట్లాడుతున్న నందమూరి బాలకృష్ణ

### 19న ఆలూరుకు చంద్రబాబు రాక

**కర్నూలు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి):** ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 19వ తేదీ శుక్రవారం ఆలూరుకు రానున్నారు. చంద్రబాబు పర్యటన దిగ్విజయం చేసేందుకు ఆలూరు టీడీపీ అభ్యర్థి బి.వీరభద్ర గౌడ్ సహా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్రజాగళం యాత్ర తొలి విడత ప్రచారం ఉమ్మడి జిల్లాలో ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డలో నిర్వహించారు. రెండో విడత జిల్లాలో ఆలూరులో 19న సాయంత్రం 3 గంటలకు జరిగే జంక్షన్ సభలో చంద్రబాబు పాల్గొంటారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, అభ్యర్థి వీరభద్రగౌడ్ తెలిపారు. ఆలూరు సభ అనంతరం చంద్రబాబు అనంతపురం జిల్లా రాయదుర్గం సభకు హాజరవుతారు.



## పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

- 1న నియోజకవర్గాల వారీగా పీవో, ఏపీవోలకు శిక్షణ
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. సృజన
- రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం



**కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 16:** ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ తన చాంబర్‌లో సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణపై అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నుంచి షెడ్యూల్ వచ్చిన వెంటనే ఆ సమాచారాన్ని సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందజేయాలన్నారు. రిటర్నింగ్ అధికారులు గుర్తించిన స్టాటిక్ సర్వెలియన్స్ టీమ్‌లు ఉండే పాయింట్లను ఇచ్చినట్లు తెలిపారు. 18వ తేదీ నుంచి సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గాల్లో జరగనున్న ఈవీఎంల రాండమైజేషన్ ప్రక్రియకు సంబంధించి వాహనంలో ఎంత మంది కూర్చొని ఉండాలనే సీటింగ్ కెపాసిటీతో పాటు ఎన్ని వాహనాలు కావాలనే వివరాలను ఈ నెల 18వ తేదీ నాటికి ఇవ్వాలని ఆర్వోలను ఆదేశించారు. అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌తో కూడా సమన్వయం ఉండేలా చూసుకోవాలని సీపీవోను ఆదేశించారు. మే 1న నియోజకవర్గాల వారీగా పీవో, ఏపీవోలకు శిక్షణా తరగతులను ఏర్పాటు చేయాలని ఆర్వోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఆర్వో, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు ఆర్వో, నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని ఆర్వో, సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, డీఆర్వో మధుసూదన్‌రావు, సీపీవో హిమ ప్రభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో చేరిన ఎమ్మెల్యే ఎర్రకోట కుటుంబ సభ్యులు



బాలయ్య సమక్షంలో టీడీపీలో చేరుతున్న ఎమ్మెల్యే బంధువులు



**ఎమ్మిగనూరు: ఏప్రిల్ 17:** ఎమ్మిగనూరు వైసీపీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి కుటుంబ సభ్యులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎర్రకోట స్వయాన సోదరుల కుమారులు, వైసీపీ నాయకులు కె.విరుపాక్షిరెడ్డి, కె.బాలకృష్ణారెడ్డి, కె. చెన్నారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాళ్లదొడ్డి కె.చెన్నారెడ్డిలు స్వర్ణాంధ్ర సాకార యాత్ర సభకు చేరుకున్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వారికి పసుపుకండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముస్లిం మైనార్టీ నాయకులు కలీముల్లా, తురేగల్ నజీర్‌లు బాలకృష్ణను సన్మానించారు. ఓ రైతు తన పొలంలో ఎండిన పంటను బాలకృష్ణకు చూపిస్తే ఆ పంటను భుజాన పెట్టుకొని ఇది జగన్ ప్రభుత్వ తీరు అని ఎద్దేవా చేశారు. అనంతరం పలువురు నాయ కులు బాలకృష్ణకు మెమొంటోలు ఇచ్చి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి, ఎమ్మిగనూరు, మంత్రాలయం టీడీపీ అభ్యర్థులు బీవీ జయనాగేశ్వరరెడ్డి, మాధవరం ఎన్. రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

# రైతు ప్రయోజనాలు పట్టవా?

- పూర్తి చేయకుండానే జంబో ప్లాట్‌ఫారం ప్రారంభం
- రూ.కోటి బిల్లు చెల్లిస్తేనే పనులు చేస్తానంటున్న కాంట్రాక్టర్



కర్నూలు మార్కెట్ యార్డులో పనులు పూర్తి కాకుండానే ప్రారంభించిన జంబో ప్లాట్‌ఫారం

**కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 16:** వైసీపీ ప్రభుత్వంలో రైతుల ప్రయోజనాల కంటే తమ ప్రయోజనాలే ముఖ్యమనే తీరులో ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో రైతుల పంట ఉత్పత్తులను నిల్వ చేసేందు కోసం రూ.6 కోట్లు ఖర్చు పెట్టి జంబో ప్లాట్‌ఫారం నిర్మాణాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయితే.. ఈ విషయాన్ని ముందుగానే అంచనా వేసిన అధికార పార్టీకి చెందిన నాయకులు షెడ్యూలుకు ముందే ప్లాట్‌ఫారం నిర్మాణాన్ని పూర్తి చేయకుండానే అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో ప్రారంభించేశారు. వాస్తవంగా జంబో ప్లాట్‌ఫారానికి సంబంధించి ప్లాస్టింగ్, కాల్వల నిర్మాణం, కల్వర్టులు, పెయింటింగ్ తదితర పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులన్నీ పూర్తయితే గానీ.. రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనాన్ని అందించే అవకాశాలు ఉండవు.

**రూ.కోటి బిల్లులు రావాలి:**

కర్నూలు మార్కెట్ యార్డులో జంబో ప్లాట్‌ఫారం నిర్మాణాన్ని చేపట్టిన కాంట్రాక్టరుకు ఇంకా రూ.కోటి దాకా బిల్లు చెల్లించాల్సి ఉంది. గత నవంబరులో రూ.70 లక్షలు, డిసెంబరులో రూ.30లక్షల బిల్లులు చెల్లించేందుకు మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు నివేదికలు అందించారు. అదిగో.. ఇదిగో అంటూనే దాదాపు 5 నెలలు గడిచిపోయాయి. బయట అప్పులు తెచ్చి ఇప్పటి దాకా పనులు పూర్తి చేసిన కాంట్రాక్టరు ఇక తమకు బిల్లులు వస్తాయో రావోనని తలపట్టుక్కూర్చున్నారు. బిల్లులు వస్తేనే పనులు చేయగలుగుతామని, ప్రస్తుతం బయటి వ్యక్తుల నుంచి తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వల నిర్మాణం పూర్తి చేయకుంటే వర్షం నీరు ప్లాట్‌ఫారాల్లోకి వచ్చి తమ పంట ఉత్పత్తులన్నీ తడిసిముద్దవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**● త్వరలోనే పనులు మొదలు పెడుతాం**

కర్నూలు మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న జంబో ప్లాట్‌ఫారంను త్వరలోనే పూర్తి చేస్తాం. వచ్చే ఖరీఫ్‌కు రైతులు ఈ ప్లాట్‌ఫారం నుంచి పూర్తి ప్రయోజనం పొందేలా చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్టరుకు సకాలంలో బిల్లులు అందినా, అందకపోయినా త్వరలోనే పనులు మొదలు పెట్టి కాల్వల నిర్మాణంతో పాటు కల్వర్టులు, పెయింటింగ్, ప్లాస్టింగ్ తదితర పనులన్నీ పూర్తి చేయిస్తాం. - సుబ్బారెడ్డి, డీఈఈ

## కడప జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

● లోకాయుక్త ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం

**కర్నూలు(లీగల్), ఏప్రిల్ 16:** కడప జిల్లాలోని రెండు మండలాల్లో ఒక రాజకీయ నాయకుడు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నాడంటూ వచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర లోకాయుక్త స్పందించింది. లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం దిగి వచ్చి సదరు ఆక్రమణలను అరికట్టింది. కడప జిల్లాలోని పోరుమామిళ్ల మండలంలోని అవధూత కాశిరెడ్డినాయన మండలాల్లో పోతిరెడ్డి నాగార్జునరెడ్డి అనే రాజకీయ నాయకుడు, అతడి కుటుంబీకులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని వాటిని రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నాడని దళిత్ కమిటీ పీపుల్ అనే సంస్థ రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై విచారించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లోకాయుక్త కడప జిల్లా కలెక్టర్‌కు గతంలో ఆదేశించింది. ఈ మేరకు కదిలిన రెవెన్యూ యంత్రాంగం సదరు అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి ఆక్రమణలను అరికట్టినట్లు రాష్ట్ర లోకాయుక్తకు తమ నివేదికలో తెలియజేశారు. దీంతో సంబంధిత రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లోకాయుక్త మంగళవారం ఆదేశాలు జారీ చేసింది.

## 22 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

**కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 16:** టైలరింగ్, (హైయర్, లోయర్) డ్రాయింగ్ (హైయ్యర్, లోయర్), హ్యాండ్‌లూమ్ (హైయర్, లోయర్) టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ మంగళవారం తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారిక వెబ్‌సైట్‌లో పొందాలన్నారు. పరీక్షల కోసం అభ్యర్థులు తప్పనిసరిగా పాస్‌ఫొటో, పాన్‌కార్డు తదితర ప్రభుత్వం జారీ చేసిన ఒక ఒరిజినల్ చెల్లుబాటయ్యేలా ఏదో ఒక ఫొటో గుర్తింపు కార్డుతో పాటు వారి హాల్‌టికెట్‌ను తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు.

## పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం

**కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 16:** ఎన్నికల ప్రవర్తన నియమావళిపై మంగళవారం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాణ్యం నియోకవర్గం ఆర్వో, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు-2024 పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్లను కర్నూలు జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో స్వీకరిస్తారని తెలిపారు. ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభవుతుందన్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చే అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ వాహనాలకు 100 మీటర్ల దూరంలో ఉంచుకోవాలన్నారు. నామినేషన్ వేయడానికి ర్యాలీగా వచ్చే అభ్యర్థులు మూడు వాహనాలను మాత్రమే వినియోగించాలని అన్నారు. ఈ సమావేశంలో వైసీపీ ప్రతినిధి సురేష్, టీడీపీ ప్రతినిధి ఛత్రపతి రెడ్డి, బీఎస్పీ పార్టీ ప్రతినిధి, పాణ్యం నియోజకవర్గ ఏఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు

## సానుభూతి కోసమే గులకరాయి డ్రామా : టీడీపీ



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

**నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 16:** ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు చెప్పుకోడానికి చేసింది ఏమీ లేక సానుభూతి కోసమే గులకరాయి డ్రామా సీఎం జగన్ రెడ్డి ఆడుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్, నంద్యాల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల అబ్జర్వర్ పోతురాజు రవికుమార్ అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రజా వ్యతిరేక పాలనతో దివాళా తీస్తుందని అన్నారు. ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు జగన్‌ను నమ్మే పరిస్థితి లేదని, వచ్చే ఎన్నికల్లో టీడీపీకి పట్టం కడతారని వారు ధీమా వ్యక్తం చేశారు.

## గౌరు సమక్షంలో టీడీపీలో చేరిక



పసుపు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గౌరు వెంకటరెడ్డి

**కల్లూరు, ఏప్రిల్ 16:** పాణ్యం నియోజకవర్గంలో టీడీపీలోకి వైసీపీ నుంచి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. ఓర్వకల్లు మండల కేంద్రానికి చెందిన వైసీపీ ముఖ్య నాయకులు పాండు, సుధాకర్, సోమశేఖర్, కృష్ణ, వెంకటేశ్వర్లు, దివాకర్, అశోక్‌తోపాటు అతని అనుచరులు టీడీపీలో చేరారు. మంగళవారం ఓర్వకల్లుకు చెందిన 40 కుటుంబాలతో నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి గౌరు వెంకటరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు ఏసేబు, మండల అధ్యక్షుడు గోవిందరెడ్డి, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, నన్నూరు విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, అయ్యస్వామి పాల్గొన్నారు.

# ఓటు అడిగే హక్కు ఉందా?

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిపై బీసీ ఫైర్



ప్రజాగళం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బీసీ

**అవుకు, ఏప్రిల్ 16:** బనగానపల్లె నియోజకవర్గంలో ప్రజలకు ఓటు అడిగే హక్కు కాటసాని రామిరెడ్డికి ఏమాత్రం లేదని మాజీ ఎమ్మెల్యే, బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుంకేసుల గ్రామానికి చేరుకున్న బీసీ సోదరులు బీసీ జనార్దన్‌రెడ్డికి, బీసీ రాజారెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో వైసీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. జగన్ వచ్చీ రాగానే వ్యవస్థలను నాశనంచేశాడని మండిపడ్డాడు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మద్యపాన నిషేధం హామీ ఏమైందని ప్రశ్నించారు. అమ్మఒడి పథకంలో రూ.2వేలు కమిషన్ తీసుకుని దోచుకున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేక ఇన్‌పుట్ సబ్సిడీ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పల్లె ప్రగతి కోసం వినియోగించాల్సిన సర్పంచుల నిధులనూ జగన్ ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సుంకేసుల గ్రామంలో సొంతనిధులతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. సంక్షేమ పథకాల అమలు టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. ఏడాదికి ప్రతి ఇంటికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని బీసీ సోదరులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీ.పక్కీరారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, మొట్ల రామిరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, కైప చంద్రశేఖర్‌రెడ్డి, కైప శేఖర్‌రెడ్డి, మంచాల ప్రతాప్‌రెడ్డి, చౌడయ్య, వల్లపురెడ్డి మోహన్‌రెడ్డి, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, నారపురెడ్డి, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రంగస్థల కళాకారులకు 'కందుకూరి' స్ఫూర్తి

విశ్రాంత కలెక్టర్ గుమ్మళ్ల బలరామయ్య

**కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 16:** సంఘ సంస్కర్త, తెలుగు భాషా వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు రంగస్థల కళాకారులకు చెదరని స్ఫూర్తి అన్నారు. మంగళవారం సాయంత్రం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి, తెలుగు నాటక రంగ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. 'కందుకూరి' పురస్కారాలను సీనియర్ రంగస్థల కళాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తొలుత కందుకూరి చిత్ర పటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బలరామయ్య మాట్లాడుతూ తెలుగు నాటక రంగ దినోత్సవం అంటే రంగస్థల కళాకారులందరికీ ఒక పండుగ వంటిదని చెప్పారు. ఆహ్వాన అతిథులుగా విచ్చేసిన విద్యాసంస్థల అధినేతలు జి.పుల్లయ్య, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ కందుకూరి జయంతిని కళాకారులంతా సమష్టిగా కలిసి జరుపుకోవడం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని అన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కళాకారులకు ప్రోత్సాహం ఇచ్చేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సందర్భంగా 'కందుకూరి' రంగస్థల పురస్కారాలు సీనియర్ నాటక కళాకారులు శారదాబాయి, ఎస్ అబ్దుల్లా, గాండ్ల లక్ష్మన్న, లక్ష్మీకాంతరావు, క్రిష్టఫర్, సుబ్బారావు, తిరుపాలు, టి. రాజశేఖర్‌రావు, పి. భాస్కర్, గుర్రపుశాల అంకయ్య, బీసన్న, కె. అరుణ, మధు, కృష్ణలకు అందజేసి జ్ఞాపిక, శాలులతో అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్‌బాషా, కళాకారులు పి. హనుమంతరావు చౌదరి, మనోహర్‌బాబు, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు ప్రదర్శించిన 'శ్రీకృష్ణ రాయబారం' నాటకంలోని పడకసీనును ప్రేక్షకులను అలరింపజేసింది.

# సమన్వయంతో పని చేయండి

వాణిజ్య పన్నుల శాఖ జేసీ సుధాకర్





మాట్లాడుతున్న వాణిజ్య పన్నుల శాఖ జేసీ సుధాకర్

**కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 16:** జిల్లాలోని స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లు (ఎస్ఎస్‌టీ) సమన్వయంతో పని చేయాలని, తమకు నిర్దేశించిన ప్రాంతాల్లో ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన తర్వాతే శిబిరాలను ఏర్పాటు చేసుకోవాలని వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని ఎస్ఎస్‌టీ బృందాలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఒక కారులో రూ.50వేలకు మించి ఆధారాలు లేని నగదు లభ్యమైతే సీజ్ చేయాలన్నారు. అదేవిధంగా పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, ఇతర ప్రచార సామగ్రి విలువ రూ.10వేలు మించితే ఆ వివరాలు ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ లాగిన్‌లో నమోదు చేయాలని సూచించారు. సదరు వివరాలు నమోదు కాగానే ఎన్నికల నిబంధనల అమలు చేస్తున్న సుమారు 13 ఏజెన్సీలకు సమాచారం వెళ్తుందన్నారు. సంబంధిత శాఖలతో ఎస్ఎస్‌టీ బృందాలు సమన్వయం చేసుకోవాలన్నారు. సీజ్ చేసిన నగదు, ఇతర వస్తువులను సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాలన్నారు. జిల్లా ఎంసీసీ నోడల్ అధికారి, జడ్పీ సీఈఓ జి.నాసర రెడ్డి మాట్లాడుతూ ఎక్కడైనా పోలీసులు, ఎఫ్ఎస్‌టీ టీమ్, ఎస్ఎస్‌టీ టీమ్ ద్వారా 13 రకాలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ఏదైనా పరిమితికి మించిన నగదు, ఇతరత్రా వస్తువుల సరఫరాను నియంత్రించినట్లయితే ఆ విషయాన్ని సంబంధిత ఆర్ఓ ద్వారా జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్/సీజర్ కమిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. హౌసింగ్ పీడీ సిద్దలింగమూర్తి మాట్లాడుతూ ఎస్ఎస్‌టీ బృందాలు తనిఖీ చేసే ప్రక్రియ మొత్తం వీడియో తీయించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# నిబంధనలను తప్పక పాటించండి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు
- రేపటి నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ



**నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 16:** నామినేషన్ల ప్రక్రియలో ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల సంసిద్ధతలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఈనెల 18 వతేదీన ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్లు స్వీకరిస్తామని అన్నారు. నామినేషన్లు వేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పాటిస్తూ అఫిడవిట్ 26ఏ లోని వర్తించే, వర్తించని కాలమ్స్‌లలో వివరాలన్నింటిని తప్పక పూరించాలని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు నామినేషన్ల దాఖలకు 13 రకాల డాక్యుమెంట్లును తీసుకురావాలని, అన్ని రకాల డ్యాక్యుమెంట్లు సక్రమంగా ఉంటే నామినేషన్లను స్వీకరిస్తామని అన్నారు. ఈనెల 18వ తేదీ నుండి 25వరకు ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని అన్నారు. ప్రభుత్వ సెలవుదినాలలో నామినేషన్ల స్వీకరణ ఉండదని అన్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చే అభ్యర్థులకు గరిష్ఠంగా 3 వాహనాల అనుమతి ఉంటుందని అన్నారు. అభ్యర్థితో సహా ఐదుగురిని ఆర్ఓ ఆఫీస్‌లోకి అనుమతి ఇస్తామన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గం కోసం ఫారం-2ఏ, అసెంబ్లీ నియోజకవర్గం కోసం ఫారం-2బి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

## టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నవీన్ కుమార్

**కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 16:** తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బీఎస్ నవీన్‌కుమార్‌ను పార్టీ అధ్యక్షులు తిక్కారెడ్డి ప్రకటించారు. మంగళవారం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నందమూరి బాలకృష్ణ సమక్షంలో ప్రకటించారు. గత టీడీపీ ప్రభుత్వంలో మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పని చేసిన ఆయనకు అవకాశం కల్పించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకార సామాజిక వర్గంపై ప్రత్యేక దృష్టి సారించి టీడీపీ గెలుపునకు కృషి చేయాలని తిక్కారెడ్డి కోరారు. మత్స్యకార కోటాలో కర్నూలు జిల్లా మంత్రాలయం సీటు ఆశించిన ఆయనకు ప్రభుత్వం అధికారం లోకి వస్తే తగిన న్యాయం చేస్తామని తెలిపారు.

## సెలవు దినాల్లో కౌంటర్లు ఏర్పాటు

**కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 16:** కర్నూలు నగర పాలక సంస్థ కార్యాలయంలోని పన్ను వసూలు కౌంటర్లు సెలవు దినాల్లో కూడా పని చేస్తాయని పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నగర పాలక సంస్థ మేనేజర్ చిన్నరాముడు మంగళవారం తెలిపారు. బుధవారం శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సెలవు రోజు అయినా కూడా స్థానిక మున్సిపల్ కార్యాల యంలో కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబం ధించిన ఆస్తి పన్ను ఏక మొత్తంగా నెలాఖరులోపు చెల్లించిన పన్నుదారులుకు 5 శాతం రాయితీ పొందవచ్చునని ఆయన తెలిపారు.

## కమిటీ ఎన్నిక



ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న వెంగల్ రెడ్డి

**కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 16:** కర్నూలు నగర ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నగర కార్యదర్శిగా రామకృష్ణ, జాయింట్ సెక్రటరీలుగా రాజశేఖర్, నాగకిషోర్ ఎన్నికయ్యారు. మంగళవారం నగరంలోని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ కార్యాలయంలో నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్న అధ్యక్షతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా జిల్లా సంయుక్త కార్యదర్శి చిరంజీవి, ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా అధ్యక్షులు వెంగల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జవహర్‌లాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని ఏపీ ఎన్జీవోల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సాయిరాం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐఎస్ఈసీ కమిటీ సభ్యులు

**కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 16:** జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఈసీ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎస్ఏపీ క్యాంపులోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక ఉన్నత పాఠశాలలో అందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జాతీయ విద్యావిధానంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. విద్యకు సంబంధించి ప్రజల పక్షాన కొన్ని మౌలిక అంశాలను తప్పక ప్రతిపాదించాల్సిన అవసరం ఉందన్నారు. ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రూపొందించిన ప్రజా ప్రత్యామ్నాయ విధానం మేనిఫెస్టోను మంగళవారం విడుదల చేశారు. ఎన్నికల్లో ఓట్ల రాజకీయాలు చేస్తున్న ఏ రాజకీయ పార్టీ కూడా విద్య గురించి పట్టించుకోక పోవడం దారుణన్నారు. కేంద్ర బడ్జెట్‌లో పది శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలిండియా కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓంకార్, జిల్లా కార్యదర్శి హరీష్ కుమార్ రెడ్డి, సభ్యులు శానవాజ్ ఫాషా, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘం నాయకుడు మల్లేష్ పాల్గొన్నారు.

## ఓటు హక్కు విలువ తెలుసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీఎల్ఓ, సీఓ, ఆర్పీలు

**కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 16:** ప్రతి ఒక్కరూ ఓటు హక్కు విలువ తెలుసుకోవాలని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు పెంచ లయ్య అన్నారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.సృజన, కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి భార్గవతేజ ఆదేశాల మేరకు మంగళవారం నగర పాలక సంస్థ అధ్వర్యంలో స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. 167 నుంచి 175 పరిధిల వరకు పోలింగ్ స్టేషన్ల వరకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్ర మంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రీసోర్స్ పర్సన్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## రేపు టీడీపీ ఆత్మీయ సమ్మేళనం

### హాజరు కానున్న టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

**కోడుమూరు, ఏప్రిల్ 16:** కోడుమూరు పట్టణంలో టీడీపీ ఆత్మీయ సమ్మే ళనం గురువారం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ కోట్ల కవితమ్మ తెలిపారు. మంగళవారం లద్దగిరి గ్రామంలోని తన స్వగృహంలో ఆమె మాట్లాడుతూ టీడీపీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో గురువారం ఉదయం 10గంటలకు ప్రారంభిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నరన్నారు. అలాగే టీడీపీ ఎంపీ అభ్యర్థి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎంపీ సంజీవ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, మాజీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు బీజేపీ, జనసేన నాయకులు కూడా హాజరవుతారని అన్నారు. ఈ కార్యక్రమానికి కోడుమూరు, సి.బెళగల్, గూడూరు, కర్నూలు మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరుకావాలని ఆమె కోరారు.

## అన్ని వర్గాల అభివృద్ధే బీజేపీ లక్ష్యం

**కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 16:** అన్ని వర్గాల అభివృద్ధే బీజేపీ లక్ష్యమని పార్టీ అధికార ప్రతినిధి పీటీ సాయిప్రదీప్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిందన్నారు. వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ పథకంలో రూ. 5లక్షల వరకు ఉచిత వైద్యం, పేదలకు మరో రూ.3 కోట్ల ఇళ్ల నిర్మాణం, 3 కోట్ల మంది మహిళలను లక్షాధికారులు చేసే దిశగా కృషి చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ వివరించినట్లు ఆయన తెలిపారు. మోదీ గ్యారెంటీ-2047 కల్లా వికసిత్ భారత్ పేరుతో బీజేపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్‌తో కలిసి మోదీ మేనిఫెస్టోను విడుదల చేశారన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

**కల్లూరు, ఏప్రిల్ 16:** మండలంలోని పంచాయతీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండల ఎంపీపీ బోయ శారద అధికారులకు సూచించారు. మంగళవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి అధ్యక్షతన చేపట్టిన జనరల్‌బాడీ సమావేశానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలో తాగునీటి సమస్య, ఉపాధి హామీ పథకం, విద్యుత్ సమస్యలపై చర్చించారు. వేసవి దృష్ట్యా మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



# టీడీపీ కూటమి గెలుపు ఖాయం

### బెస్తల ఆత్మీయ సమావేశంలో టీజీ భరత్

**కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 16:** రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలవడం ఖాయమని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గం బెస్తల ఆత్మీయ సమావేశంలో టీజీ భరత్ పాల్గొని మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగ లేదని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు దూరమయ్యాయని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక 217 జీవోను రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి హర్షద్, టీడీపీ నాయకులు చేపల రమేష్, బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుబాస్ చంద్రబోస్, ఫిషరీస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ నవీన్ కుమార్, జగన్, ముని, విజయ్, అర్జున్, పవన్, రాము, అశోక్, భాస్కర్, మునెమ్మ, వెంకటేశ్వర్లు, మధు, నర్సప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

● **టీడీపీలో చేరిక..** కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు కొత్తిమిర వెంకటేష్, వైసీపీ నేత జలగరి ఆనంద్‌లు వారి బృందాలతో కలిసి


సంక్షేమ పథకాల గురించి వృద్ధుడికి వివరిస్తున్న టీజీ భరత్


మాట్లాడుతున్న టీజీ భరత్

తెలుగుదేశం పార్టీలో చేరారు. టీజీ భరత్ వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ విజయానికి కష్టపడాలని వారిని కోరారు.

**టీడీపీని నమ్మితేనే భవిష్యత్తు:** తెలుగుదేశం పార్టీని నమ్మితేనే ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందని కర్నూలు అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని ఒకటో వార్డులో పెద్ద మార్కెట్‌లో టీజీ భరత్ భరోసా యాత్ర చేపట్టారు. వైసీపీ హయాంలో కర్నూలులో ఎలాంటి అభివృద్ధి జరగ లేదన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించలేని నాయకులు ఇక ఏం అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. ఈ ఐదేళ్లలో విద్యుత్ చార్జీలు, గ్యాస్ ధరలు , నిత్యావసర సరకుల ధరలు పెరిగాయని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందజేస్తామన్నారు. అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. బీజేపితో పొత్తు ఉన్నందున ముస్లింలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మైనార్టీల రిజర్వేషన్లు తీసేస్తామని వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి హర్షద్, రాయలసీమ ఇన్‌చార్జి పవన్, కార్పొరేటర్ లతీఫ్, టీడీపీ నాయకులు ఆనంద్, హమీద్, కలీమ్, బాలు, కిరణ్, సాయి, ఆయాత్‌బీ, అశోక్, వివేక్, అరవింద్, యేగేష్, అబ్బాస్, బుజ్జి, కార్తీక్, నరసింహ, ప్రేమ్, ప్రభాకర్, నవీన్, భారత్ సింగ్ పాల్గొన్నారు.

# టీడీపీతోనే బీసీలకు సామాజిక భద్రత: గౌరు

**కల్లూరు, ఏప్రిల్ 16:** తెలుగుదేశం పార్టీలోనే బీసీ కులాలకు సామాజిక భద్రత ఉంటుందని నందికొట్కూరు పార్టీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు మండలం కొంగన పాడులో చేపట్టిన జయహో బీసీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. చంద్రబాబును సీఎంగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలపై దాడులు పెరిగాయన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రశ్నించిన బీసీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. బీసీలంతా కలసి టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున టీడీపీ మండల అధ్యక్షుడు డి.రామాం జనేయులు, ఉలిందకొండ టీడీపీ నాయకుడు ఈవీ.రమణ, వినోద్‌కుమార్, రంగ స్వామిరెడ్డి, మాదేష్, ధనుంజయ, కాసాని మహేష్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, శేషన్న, శ్రీరాములు, మురళి, పర్ల గోరంట్ల, డీలర్ మాదన్న పాల్గొన్నారు.

● **తిక్కారెడ్డికి సన్మానం:** కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తిక్కారెడ్డిని కల్లూరు మండల టీడీపీ నాయకులు


సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న గౌరు జనార్దన్‌రెడ్డి


కొంగనపాడులో జయహో బీసీలో మాట్లాడుతున్న గౌరు వెంకటరెడ్డి

మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఉలిందకొండ టీడీపీ నాయ కులు ఈవీ రమణ, కాసాని మహేష్‌గౌడ్, వాకిటి మాదేష్‌ల బృందం పూల బొకేలు, శాలువాలతో తిక్కారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆకెపోగు ప్రభాకర్, కర్నూలు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ముంతాజ్‌బేగం, ధనుంజయ పాల్గొన్నారు.

● **గౌరు చరిత గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: గౌరు జనార్దన్‌రెడ్డి**

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత తనయుడు గౌరు జనార్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కలూరు అర్బన్ 35వ వార్డు శివప్పనగర్‌లో క్లస్టర్ ఇన్‌చార్జి పీయూ మాదన్న ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ కరపత్రాలను ఇంటింటికీ తిరిగి ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి రవిప్రకాష్‌రెడ్డి, మణి, శేఖర్ గౌడ్, రంగప్ప, ఎల్లనాగన్న, సుంకన్న, ఎల్లప్ప, లక్ష్మన్న, సోమన్న, నవీన్, తులసీకృష్ణ పాల్గొన్నారు.

## టీడీపీలో చేరిన గూడూరు కాంగ్రెస్ నాయకులు


టీడీపీలో చేరిన వారితో విష్ణువర్ధన్‌రెడ్డి

**కర్నూలు(రూరల్), ఏప్రిల్ 16:** గూడూరులోని సంజీవయ్యనగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ పుల్లన్నతోపాటు మరో 50మంది నాయకులు, కార్యకర్తలు మంగళవారం కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి విష్ణు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్రంలో టీడీపీ గెలుపు చారిత్రక అవసరమన్నారు. వైసీపీ హయాంలో ఏపీ తీవ్రంగా నష్టపోయిందని, యువ తకు ఉద్యోగాలు లేక ఇతర రాష్ట్రాలకు వెళ్లే పరి స్థితి ఉందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు అభి వృద్ధి చెందాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరిన వారిలో చిన్న కషన్న, శివకుమార్, మునిస్వామి, శ్రీనివాసులు, రాజు, వెంకటరాజు, వెంకటరాముడు, ప్రవీణ్‌కుమార్, పెద్దరంగడు, ప్రభాకర్, సురేష్, మధు, నల్లన్న, శ్రీను, చెన్నకేశవులు, నాగరాజు, శేఖర్ ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దండు సుందర్‌రాజు, రామాంజనేయులు, గజేంద్ర గోపాల్ నాయుడు, వెంకటేష్, పౌల్, సృజన్, షేక్షావలి, కౌన్సిలర్ బుడ్డంగలి, విజయ్‌కుమార్, వీరకు మార్ పాల్గొన్నారు.

● సి.బెళగల్ మండలం కంపాడు గ్రామానికి చెందిన బీకె రాఘవేంద్ర ఆధ్వర్యంలో దాదాపు 40 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి విష్ణువర్ధన్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఉప్పరి రామకృష్ణ, వెంకటేష్, తిమ్మప్ప, శ్రీరాముడు, బజారి, నాగన్న, వెంకటేష్, గట్టప్ప, సోమేశ్వరరెడ్డి, దానప్ప ఉన్నారు.

● కర్నూలు రూరల్ మండలం రేమట గ్రామం నుంచి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దాదా పు 50మంది టీడీపీకి మద్దతు తెలిపారు. అనం తరం విష్ణువర్ధన్ రెడ్డిని కలిసి పూలమాలతో సత్క రించారు. మద్దతు తెలిపిన వారిలో హనుమంతు, శ్రీనివాసులు, తిమ్మప్ప, శ్రీను, మహేష్, బాలు, చిరంజీవి, వడ్డెన్న, గోవర్ధన్, పులకేశి, వెంకటేష్, ముత్యాల్, ఆంజనేయులు, హరికృష్ణ, కుమార్, మహేష్, బీసన్న, చిన్న తిమ్మప్ప పాల్గొన్నారు.

## తొలిసారిగా స్కోరింగ్ బెలూన్ యాంజియోప్లాస్టీ

**కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 16:** వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకుంటూ.. దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న 68 ఏళ్ల వ్యక్తికి గుండెలో సమస్య తలెత్తింది. అయితే.. ఈ కేసులో రిస్క్ ఎక్కువ ఉండటంతో యాంజియోప్లాస్టీ చేసేందుకు కొందరు వైద్యులు ముందుకు రాలేదు. దీంతో రోగి కర్నూలు కిమ్స్ హాస్పిటల్ వైద్యులను సంప్రదించారు. రోగికి విజయవంతంగా స్కోరింగ్ బెలూన్, యాంజియోప్లాస్టీ అనే చికిత్స చేసి స్టంట్లు వేసి జబ్బును నయం చేశారు. కొండాపురం గ్రామానికి చెందిన ఉద్యోగి ఓంకారం సత్యనారాయణ రాజు దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన డయాలసిస్ రోగి. ఆయన గుండె రక్తనాళాల్లో కాల్షియం పేరుకుపోయి రెండు నాళాలు బ్లాక్ అయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు నాగేంద్రప్రసాద్‌ను సంప్రదించారు. అత్యాధునిక స్కోరింగ్ బెలూన్‌తో రోగి పీటీసీఏను చేశారు. ఈ బెలూన్ ఎడమవైపు గుండె రక్తనాళాల్లో పేరుకుపోయిన కాల్షియంను తొలగించారు.


రోగితో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ నాగేంద్ర

## సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించాలి

**ఓర్వకల్లు, ఏప్రిల్ 16:** సూపర్ సిక్స్ పథకాలపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఓర్వకల్లులో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీ లకు 50 సంవత్సరాలకే రూ.4వేలు పింఛన్ ఇస్తారన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం 30 ఏళ్ల అభివృద్ధిలో వెనక్కి వెళ్లిందన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, ఎల్లారెడ్డి, కురువ జయన్న, కురువ అల్లాబాబు, గుట్టపాడు చిన్న, వేణుగోపాల్ రెడ్డి, అయూబ్‌బాషా పాల్గొన్నారు.

**కోడుమూరు(రూరల్):** మండలంలోని లద్దగిరి మజారా రామాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ నాయకులు ఆదాంబాషా, పట్టి మధు ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరిగి సూపర్ పథకాలతో చేకూరే లబ్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మేకల శంకర్, గుడిసె లక్ష్మన్న, గిరి, రాము, కొండాపురం మధు, హుస్సేన్, రవి పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోండి

**కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 16:** వేసవి కాలంలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. జవహర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం తాగునీటి, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకుని, తాగునీటికి ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు అవసరం ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ మాసం వరకు తాగునీటి సరఫరాలో జాప్యం రాకుండా ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జి.సృజన, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేశ్వరరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు శుభాకాంక్షలు


కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీఆర్ఎస్ఏ నాయకులు

**కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 16:** కర్నూలు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకుని సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు గిరికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఏపీఆర్ఎస్ఏ నాయకులు కలెక్టర్ జి.సృజనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యకు కూడా శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా సయ్యద్ జలాలుద్దీన్ ఖాద్రి ఉరుసు

**సి.బెళగల్, ఏప్రిల్ 16:** మండలంలోని గుండ్రేవుల గ్రామంలో వెలసిన సయ్యద్ జలాలుద్దీన్ ఖాద్రి ఉరుసు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దర్గా పీఠాధిపతి సయ్యద్ రసూల్ మాట్లాడుతూ స్వామి వారిని దర్శించుకునేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి గాక తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, బీజాపూర్ నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ దర్గాలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట చాకలి నరసింహుడు, బాలకృష్ణ, గోరంట్ల, రాముడు ఉన్నారు.

# 18 నుంచి నామినేషన్ల స్వీకరణ: ఆర్వో

**కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 16:** ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నామని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవతేజ తెలిపారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావే శాన్ని నిర్వహించారు. ఈ మేరకు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన పలు సూచనలు చేశారు. ఈనెల 18న ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల అయిన వెంటనే నామినే షన్లను స్వీకరిస్తామన్నారు. ఈ 26న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణకు 29వ తేదీ చివరి గడువు అని, ఇప్పటికే నామినేషన్ల స్వీకరణకు సంబంధించి నగర పాలక కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులు 100 మీటర్ల దూరం వరకు మాత్రమే వాహనాలు అనుమతిస్తామని చెప్పారు.


మాట్లాడుతున్న ఆర్వో ఎ.భార్గవతేజ

## గ్రామాల్లో పోలీసుల కవాతు


కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలతో పోలీసులు

**గూడూరు, ఏప్రిల్ 16:** గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మునగాల, మల్లాపురం గ్రామాల్లో మంగళవారం కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ హనుమంతయ్య మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహక రించాలని, ప్రజలంతా స్వేచ్ఛగా ఓటును వినియోగించుకోవాలని సూచించారు.

## జి.పుల్లయ్య కళాశాల ఎంబీఏ విద్యార్థుల ప్రతిభ

**కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 16:** స్థానిక వెంకాయపల్లిలోని జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ విద్యార్థులు నంద్యాల రామకృష్ణ పీజీ కళాశాలలో నిర్వహించిన 25వ నేషనల్ లెవెల్ మేనేజ్మెంట్ మీట్-2024లో ప్రతిభ కనబరిచారు. ఫైనాన్స్ ఈవెంట్‌లో ఆనం మహిన్ మొదటి బహుమతి, బిజినెస్ క్విజ్‌లో అలేఖ్య, భవజ్ఞ, మనోనందిత రెండో బహుమతి, మార్కెటింగ్ హెచ్ఆర్ ఈవెంట్‌లో కార్తీక్, హర్షవ ర్ధన్ రెండో బహుమతి, పేపర్ ప్రెజెంటేషన్‌లో రాఘవేంద్ర, మురళీకృష్ణ ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. మంగళవారం కళాశాలలో ఏర్పా టు చేసిన అభినందన సభలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు విజేతలను అభినందించారు. ఎంబీఏ విభాగాధిపతి గిరిధర్ కుమార్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

## ముగిసిన రామాయణ ప్రవచన సప్తాహం

**కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 16:** వారం రోజులుగా టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో, పాతనగరంలోని శ్రీరాంబొట్ల దేవాలయంలో కొనసాగుతున్న శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహం మంగళవారం రాత్రి ముగిసింది. చివరి రోజున హిందీ పండితుడు జి. ప్రవీణ్‌కుమార్ రామాయణ మహా గ్రంథం - జగతికి సందేశం అనే అంశంపై ప్రవచన వ్యాఖ్యానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్ పర్సన్ నగరూరు దీప్తి, కార్పొరేటరు శ్రీనివాసులు, ఆలయ ఈవో దినేష్‌కుమార్, అర్చకులు గిరిశ శర్మ, హిందీ అధ్యాపకులు సీతామహాలక్ష్మి, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మల్లు వెంకటరెడ్డి

## రాములోరి పెళ్లికి ఆలయాలు సిద్ధం


వర్కూరు దళితవాడలో ముస్తాబైన రామాలయం

**కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 16:** శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల పెళ్లికి సర్వం సిద్ధం చేశారు. మండలంలోని వర్కూరు దళిత వాడలో వెలసిన రామాలయంలో మంగళవారం రాత్రి సీతారాములకు తాంబూ లం నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం కల్యాణం, సాయంత్రం రథోత్సవం జరిపించనున్నారు. అలాగే పులకుర్తి వాల్మీకి ఆలయంలో ఉదయం అభిషేకం, అనంతరం స్వామిఅమ్మవార్ల కల్యాణం, సాయంత్రం ఉత్సవమూర్తుల ఊరేగింపు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.

## శరీరానికి ఐరన్ అవసరం: డీఎంహెచ్‌వో

**కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 16:** శరీరానికి ఐరన్ ఎంతో అవసరమని డీఎంహెచ్‌వో డా.వై. ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. మంగళవారం ఈ. తాండ్రపాడు పీహెచ్‌సీ పరిధిలోని పంచలింగాల సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆహారంలో ఐరన్ లోపం ఉంటే రక్తం ఎర్రగా ఉండే గుణాన్ని తగ్గిస్తుందని, ప్రభుత్వం అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడటం వల్ల రక్తహీనత రాదని తెలిపారు. రక్తం పెరగాలంటే ద్రాక్ష, పాలు, గుడ్లు, పండ్లు, బుడ్డల గట్టాలు, ఆకుకూరలు మొదలగు పోషక విలువలు కలిగిన పదార్థాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మంజుషా, సామాజిక ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశాలు, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

## హోంగార్డు సస్పెన్షన్

**కర్నూలు, ఏప్రిల్ 16:** వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెంట ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హోంగార్డు హబీబ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, ఎస్వీ మోహన్ రెడ్డి వెంట ఎలక్షన్ సెల్ విభాగంలో పని చేసే హోంగార్డు హబీబ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. ప్రచార ఫొటోలు సోషల్ మీడియాలో రావడంతో ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఈ నేపథ్యంలో హోంగార్డును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# భారీ సక్సెస్

**ఎమ్మిగనూరు/గోనెగండ్ల/నందవరం/మంత్రాలయం/కోసిగి, ఏప్రిల్ 17:** స్వర్ణాంధ్ర సాకార యాత్రకు ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గ ప్రజలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. బాలకృష్ణ రాకతో రెండు నియోజకవర్గాల టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగ మంగళవారం బాలకృష్ణ రోడ్‌షో నిర్వహించారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోకి వేముగోడు దగ్గర అడుగుపెట్టిన ఆయనకు ప్రజలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి హెచ్‌కైరవాడి, గోనెగండ్ల, రాళ్లదొడ్డి, ఎర్రకోట మీదుగ ఎమ్మిగనూరు చేరుకున్నారు. పట్టణంలోకి చేరుకున్న బాలయ్యబాబుకు అడుగడుగునా ప్రజలు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. శివ సర్కిల్‌లో గంటకు ముందుగానే భారీ ఎత్తున టీడీపీ శ్రేణులు, బాలయ్య అభిమానులు చేరుకోవడంతో జనసంద్రంగా మారింది. బాలకృష్ణను చూసేందుకు మహిళలు, చిన్నారులు, యువకులు, నందమూరి అభిమానులు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో ప్రధాన వీధులన్నీ జనమయంగా మారాయి.అలాగే చిన్నారులు టీడీపీ జెండాలను చేతపట్టుకొని బాలయ్య రోడ్‌షోలో విక్టరీ సింబల్ చూపుతూ బాలయ్యకు అభివాదం చేశారు. అలాగే ముస్లింమైనార్టీ నాయకులు బాలయ్యను ఘనంగా సన్మానించారు. అలాగే ముగతి, హలహర్వి పరిధిలో మంత్రాలయానికి వెళ్తుండగా ఆయా గ్రామాల ప్రజలు బాలయ్య అభిమానులు కేరింతలు కొడుతూ జై బాలయ్య జై బాలయ్య అంటూ నినాదాలు చేశారు.

మంత్రాలయం నియోజకవర్గం కోసిగి మండల కేంద్రంలో మంగళవారం రాత్రి 7 గంటలకు స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా ప్రముఖ సినీ నటుడు, హిందుపురం ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు నందమూరి బాలకృష్ణ రోడ్‌షోలో పాల్గొన్నారు. బాలకృష్ణ రోడ్‌షోకు సుమారు 30వేల మందికి పైగా జనాలు హాజరయ్యారు. కోసిగి రోడ్లన్నీ జనసునామిని తలపించింది. మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం, పెద్దకడుబూరు, కోసిగి, మంత్రాలయం మండలాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీనాయకులు, కార్యకర్తలు ఈ రోడ్‌షోకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కోసిగి గ్రామం మొత్తం జనసమూహంతో నిండిపోవడంతో టీడీపీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఎన్డీయే కూటమి అభ్యర్థులు మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డిని, కర్నూలు పార్లమెంటు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి వేయించి గెలిపించాలని బాలకృష్ణ కోరారు. కర్నూలు పార్లమెంటు టీడీపీ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఆధ్వర్యంలో కోసిగిలో బాలకృష్ణ రోడ్‌షోకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. కర్నూలు పార్లమెంటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి ఆధ్వర్యంలో కోసిగిలో బాలకృష్ణ రోడ్‌షోకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. అనంతరం రోడ్‌షోలో బాలకృష్ణ మాట్లాడుతూ కోసిగి మండల పరిధిలో ఉన్న ఆర్డీఎస్ కుడి కాలువ పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. నియోజకవర్గంలో నాలుగు ఎస్ఎస్ ట్యాంకులు నిర్మించి కొళాయిలు వేసి తాగునీరు అందిస్తామన్నారు. కోసిగి మండలంలో ఎస్ఎస్ ట్యాంకులు నిర్మించి ప్రతి గ్రామానికి తాగునీరు అందిస్తామని బాలకృష్ణ పేర్కొన్నారు.



ఎమ్మిగనూరు రోడ్‌షోకు హాజరైన జనం

↑కోసిగిలో అభిమాన జనసంద్రం





ఎమ్మిగనూరు రోడ్‌షోలో మాట్లాడుతున్న బాలయ్య చిత్రంలో తిక్కారెడ్డి, నాగరాజు, జయనాగేశ్వరరెడ్డి, సంజీవ్‌కుమార్



కోసిగి రోడ్‌షోలో మాట్లాడుతున్న బాలయ్య చిత్రంలో రాఘవేంద్రరెడ్డి, తిక్కారెడ్డి



ఎమ్మిగనూరులో మిద్దెల పైనుంచి అభివాదం చేస్తున్న అభిమానులు



గోనెగండ్లలో గజమాలతో స్వాగతం పలుకుతున్న అభిమానులు



బాల అభిమాని, అభిమానుల కోలాహలం



## లింగాయత్‌ల మద్దతు టీడీపీకే

● లింగాయత్‌లను అవమానించిన జగన్‌కు బుద్ధి చెబుతాం

**తుగ్గలి, ఏప్రిల్ 16:** లింగాయత్ కులస్థులను అవమానించిన సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతామని, టీడీపీకే లింగాయత్‌ల మద్దతు అని వీరశైవ లింగాయత్ జిల్లా నాయకులు బాదడ కౌశిక్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే సీటు ఆశించిన కాపు రామచంద్రారెడ్డిని "రాష్ట్రంలో మీరెక్కడున్నారు.. కేవలం కర్ణాటకలో ఉన్నారంటూ" ఎద్దేవా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 18 లక్షల మంది, కర్నూలు జిల్లాలో 1.80లక్షల మంది లింగాయతులు ఉన్నారని అన్నారు. తమను అవమానించిన జగన్‌కు ఈ ఎన్నికల్లో ఓటుతోనే బుద్ధి చెప్పి లింగాయతుల ప్రతి ఓటు టీడీపీకే వేస్తామని స్పష్టం చేశారు. ప్రతి లింగాయత్ టీడీపీకే మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

## 21న రాత పరీక్షలు

**మద్దికెర, ఏప్రిల్ 16:** మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 21న ఆదర్శ పాఠశాలలో రాతపరీక్షలు ఉంటుందని ప్రిన్సిపాల్ కరణం సవిత తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడు చేసుకొని ఈ నెల 21వ తేదీన ఆదర్శ పాఠశాలలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

## బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి

**మద్దికెర, ఏప్రిల్ 16:** మండలంలో ఎరువులు, విత్తనాల షాపుల డీలర్లు ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుకు సంబంధించిన బిల్లులను రైతులకు తప్పనిసరిగా ఇవ్వాలని వ్యవసాయశాఖ మండల అధికారి ఉప్పర రవి తెలిపారు. మంగళవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో డీలర్ల సమావేశం జరిగింది. డీలర్లకు ఖచ్చితంగతా లైసెన్సు ఉండాలని, ప్రభుత్వ గుర్తింపు పొందిన విత్తన తయారీ సంస్థల నుంచి మాత్రమే విత్తనాలు తెప్పించి రైతులకు విక్రయించాలని సూచించారు.

## మంగళసూత్రం, కాలిమెట్టెలు విరాళం

**మంత్రాలయం, ఏప్రిల్ 16:** నియోజకవర్గంలోని కౌతాళం మండలంలోని పొదలకుంట మదిరి గ్రామంలో బసవ లింగప్ప తాత మఠంలో పంపాపతి తాత ఆధ్వర్యంలో పేదవారికి జరిగే సామూహిక ఉచిత వివాహాలకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి మంగళసూత్రాలు, కాలిమెట్టెలను విరాళంగా అందజేశారు. మంగళవారం తన నివాసం వద్ద వచ్చిన వారికి గత 14 ఏళ్లుగా మఠంలో జరుగుతున్న ఉచిత సామూహిక వివాహాలకు నూతన దంపతులకు బంగారుతో తయారు చేసిన మంగళసూత్రం, వెండి కాలిమెట్టలు అందజేశారు.

## జర్నలిస్టులకు ప్రత్యేక చట్టాలను అమలు చేయాలి

**పత్తికొండ టౌన్, ఏప్రిల్ 16:** జర్నలిస్టులకు ప్రత్యేక చట్టాలను అమలయ్యేలా చూడాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్, గౌరవాధ్యక్షుడు రంగన్న, నియోజకవర్గ అధ్యక్షుడు సాలురంగడు పత్తికొండ అసెంబ్లీ బరిలో నిలిచిన అభ్యర్థులను కోరారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్య, టీసీపై కార్యాలయంలో ఆ పార్టీ అభ్యర్థి మిద్దె వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే నాయకులు మంజునాథ్, రంగన్న, గిడ్డయ్య, రమేష్, మధుబాబు, ఇర్ఫాన్, నాగేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఎమ్మెల్సీకి జైలు శిక్ష హర్షణీయం

**పత్తికొండ టౌన్, ఏప్రిల్ 16:** దళితులపై దాడికి పాల్పడిన సంఘటనలో వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు 18 నెలలు జైలు శిక్ష విధించడం హర్షణీయమని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంథోలి ముత్యాల తిరుపాలు మాదిగ అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి హర్షం వ్యక్తం చేశారు. తిరుపాల్ మాదిగ మాట్లాడుతూ 1996 డిసెంబరు 29న కోనసీమ జిల్లా వెంకటపాలెం గ్రామంలో దళితులను శిరోముండనం చేసి దాడికి పాల్పడి అవమానించిన సంఘటనలో అప్పట్లో తోట త్రిమూర్తులతో పాటు మరికొంత మందిపై కేసు నమోదయ్యిందని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో దళితులను టార్గెట్ చేస్తూ దాడులకు, హత్యలకు పాల్పడుతోందని విమర్శించారు. వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని, దళితులపై దాడులకు పాల్పడితే.. సహించేది లేదని హెచ్చరించారు. టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు బోనాల కాశీ, హోసూరు అంజి, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు సోమ్లా నాయక్, బీసీ సెల్ నాయకులు బీటీ గోవిందు, శ్రీనివాసగౌడు,నరసింహులు, ముని నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించాలి : ఆర్‌వో

**పత్తికొండ, ఏప్రిల్ 16 :** రాజకీయపార్టీల అభ్యర్థులు నామినేషన్‌వేసేందుకు ఎన్నికలసంఘం నిబంధనలు పాటించాలని ఆర్‌వో రామలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు సేవింగ్‌ఖాతాను కొత్తగా ప్రారంభించి ఆ ఖాతా ద్వారా ఎన్నికల ఖర్చులను చూపాలని పేర్కొన్నారు. నామినేషన్‌వేసేందుకు వచ్చే అభ్యర్థితోపాటు నలుగురికి కార్యాలయంలోకి అనుమతి ఉంటుందన్నారు. అలాగే నామినేషన్‌వేసే తేదీలను ఆయాపార్టీలు ముందస్తుగా సమాచారం అందించాలని సూచించారు.

ఫోటో నెం 7 : నలకదొడ్డిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

## టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

**పత్తికొండ, ఏప్రిల్ 16 :** టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు రామానాయుడు, తిరుపాల్, బత్తినిలోక్‌నాథ్ అన్నారు. బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నలకదొడ్డి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి మినీ మేనిఫెస్టో ప్రజలకు వివరించారు. వైసీపీ అరాచక పాలనకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. టీడీపీ నాయకులు ఈశ్వరప్ప, కడవలసుధాకర్, బీటీగోవిందు, శ్రీనివాసులుగౌడ్ పాల్గొన్నారు.

అలాగే పత్తికొండ పట్టణంలోని 6వ వార్డులో తెలుగు యువత నాయకులు శ్రీకాంత్‌చౌదరి, ప్రకాష్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు, యువతకు ఉపాధి అవకాశాలు అందుతాయని పేర్కొన్నారు.



## సమస్యలు పరిష్కరించే పార్టీలకే మా మద్దతు

**ఆలూరు, ఏప్రిల్ 16:** విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే పార్టీలకే మా మద్దతు ఉంటుందని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక అరికేర గురుకులంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చ లేదన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ప్రతిఏటా డీఎస్సీ నిర్వహించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.



## ముగ్గురిపై కేసు నమోదు

**ఆదోని రూరల్, ఏప్రిల్ 16 :** ఆదోని మండలం గోనబావికి చెందిన వీరేంద్ర, నరసప్పతోపాటు మరో మహిళపై కేసు నమోదు చేసినట్లు తాలుక ఎస్.ఐ ఎర్రిస్వామి తెలిపారు. మంగళవారం నరసప్ప, వీరేంద్ర కోర్టులో ఉన్న 2.5సెంట్ల స్థలం విషయంలో ఇద్దరూ ఘర్షణ పడ్డారన్నారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ తెలిపారు.

## ఉమ్మడి ప్రచారం కలిసి వస్తోంది : పార్థసారధి

**ఆదోని టౌన్, ఏప్రిల్ 16:** టీడీపీ, బీజేపీ, జనసేన మూడు పార్టీల నాయకులు గ్రామాల్లో ఉమ్మడిగా కొనసాగిస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని కూటమి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ పార్థసారధి అన్నారు. మంగళవారం ఉమ్మడి పార్టీల ప్రచార కార్యాలయం కార్తికేయ ఫంక్షన్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం మోదీ నేరుగా సర్పంచుల ఖాతాలోకి జమ చేసిన రూ. కోట్ల నిధులు వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించి ఇతర అవసరాలకు వాడుకునిందన్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామాల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించలేని దుస్థితి నెలకొందని సర్పంచులు వాపోతున్నారని అన్నారు. చిన్నపాటి సమస్యల పరిష్కారం కోసం నిధులు లేక ప్రజలకు సమాధానం చెప్పలేక సర్పంచులు మొహం చాటేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కొందరు సర్పంచులు గ్రామాలు వదిలి ఆదోని పట్టణంలో తలదాచుకోవాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రాకపోవడం, కరువు మండలాలుగా ప్రకటించకపోవడం, వలసలను అరికట్ట లేకపోవడంతో అనేక గ్రామాలు తీవ్ర దుర్భిక్షంతో అల్లాడి పోతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి వారిని కలిసి కనీసం ఓదేర్చే కార్యక్రమాలు కూడా చేయలేదని విమర్శించారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ప్రచారంలో తనతో పాటు పాల్గొన్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, శ్రీకాంత్ రెడ్డి, మదిరే ఖాస్కర్ రెడ్డి, బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ జైన్, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప తదితరులకు గ్రామాల్లో ప్రజలు ఉత్సాహంగా ఆహ్వానాలు పలకడం సంతోషంగా ఉందన్నారు.



మాట్లాడుతున్న పార్థసారధితోపాటు ఎమ్మెల్యేలు మీనాక్షినాయుడు, ప్రకాష్ జైన్

## గజమాలతో స్వాగతం

**మంత్రాలయం, ఏప్రిల్ 16:** మంత్రాలయం నియోజకవర్గంలో మొదటిసారిగా వచ్చిన ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సొంత గ్రామమైన మాధవరంలో క్రేన్ సాయంతో భారీ గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. మంగళవారం రాత్రి మంత్రాలయం, చెట్నపల్లి మీదుగా మాధవరం చేరుకున్న బాలకృష్ణ మాధవరం సర్కిల్‌లో క్రేన్‌తో గజమాల వేసిన అనంతరం అందరికీ అభివాదం చేశారు. కొంతసేపు బాలకృష్ణ, ఎన్టీఆర్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలిరావడంతో కిక్కిరిసిపోయింది. అనంతరం కోసిగి సభను ముగించుకుని మాధవరం ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి ఇంట్లో బాలకృష్ణ బస చేశారు.

## స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి

**తుగ్గలి, ఏప్రిల్ 6:** త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలని, మీకు భరోసా కల్పిస్తామని తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున అన్నారు. మంగళవారం తుగ్గలి పోలీస్ స్టేషన్ పరిధిలోని రామకొండ, రాంపల్లి, ఆర్.ఎస్ పెండేకల్లు, తుగ్గలి, ఎద్దులదొడ్డి గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు కవాత్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఎటువంటి అల్లర్లకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## శ్రీరామ నవమికి ముస్తాబైన ఆలయాలు

**ఎమ్మిగనూరు, ఏప్రిల్ 17:** శ్రీరామనవమి పర్వదినానికై పట్టణంలోని ఆయా ప్రాంతాల్లోని సీతారాముల ఆయాలను నిర్వాహకులు ముస్తాబు చేశారు. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా వీవర్స్ కాలనీలో వెలసిన సీతారామాంజనేయస్వామి ఆలయం, రామస్వామి ఆలయంతో పాటు ఆయా ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీవర్స్ కాలనీలో ఉన్న ఆలయ ముఖద్వారంతో పాటు ఆలయాన్ని చూడ ముచ్చటగా అలంకరించారు. ఆయా ఆలయాల్లో స్వామివారి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు.

## నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం

● అభ్యర్థితోపాటు నలుగురికి మాత్రమే అనుమతి

● ఆర్‌ఓ, సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

**ఆదోని రూరల్, ఏప్రిల్ 16 :** సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల స్వీకరణకు అధకారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అభ్యర్థితోపాటు నలుగురికి మాత్రమే ఆర్‌ఓ కార్యాలయం లోపలికి వచ్చేందుకు అనుమతి ఉంటుందని ఆర్‌ఓ, సబ్ కలెక్టర్ శివ నారాయణశర్మ అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 18 నుంచి నామినేషన్ల సమర్పణ ఉండడంతో సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని అధికారులు సిద్ధం చేశారు. గతంలో తహసీల్దార్ కార్యాలయం ఆర్‌ఓ కార్యాలయంగా ఉండేది. ఈ సారి సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ఆర్‌ఓ కార్యాలయంగా అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో దాదాపు కార్యాలయానికి 100 మీటర్ల వరకు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఇతర వాహనాలకు అనుమతి లేకుండా చర్యలు చేపట్టారు. దీంతోపాటు పోలీస్ బలగాలు కూడా ఏర్పాటు చేశారు. శివ నారాయణశర్మ మాట్లాడుతూ నామినేషన్లు ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు స్వీకరించబడుతాయని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

## బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

**దేవనకొండ, ఏప్రిల్ 16:** అన్ని రంగాల్లో బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునీత, శివలింగమ్మ, హషీనా బేగం, పద్మావతి అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో తల్లిదండ్రులు బాల్యవివాహాలు జరిపించాలని చుస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అత్యాచారాలు, గృహ హింస, బాల్య వివాహాలను అరికట్టాలంటే బాలికల చదువుతోనే సాధ్యమన్నారు. విద్యార్థినులు సమస్యలపై వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి ,వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారి సునీత

## టీడీపీతోనే బీసీలకు న్యాయం

**మద్దికెర, ఏప్రిల్ 16:** బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటేనే.. టీడీపీతోనే సాధ్యమని మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, పట్టణ టీడీపీ అధ్యక్షులు గడ్డం రామాంజనేయులు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పారా విశోబ అన్నారు మంగళవారం సాయంత్రం మద్దికెర టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తుగ్గలి గ్రామానికి చెందిన తుగ్గలి నాగేంద్రకు టీడీపీలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శిగా ఎంపిక కావడంతో హర్షం వ్యక్తం చేశారు. తుగ్గలి మండలంలో తుగ్గలి నాగేంద్ర పార్టీ కోసం ఎనలేని కృషి చేస్తున్నందు వల్ల ఆయనకు మంచి సముచిత స్థానం లభించిందన్నారు. టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సీఎం జగన్ రెడ్డి సానుభూతి నాటకాలు ఆడుతున్నారని అన్నారు. 2019 ఎన్నికల్లో కోడికత్తి డ్రామా, ఇప్పుడు గులకరాయి డ్రామా ఆడుతున్నారని ప్రజలు నమ్మే స్థితిలో ఎవరూ లేరని అన్నారు. ఎన్డీయే కూటమి విజయంసాధించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. పత్తికొండ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు, కర్నూలు ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో మాస్టారు, గుడి ఎల్లప్ప, సాయినగర్ బాషా, నరసింహులు, ఎస్.లక్ష్మినారాయణ ఉన్నారు.

## ఉపాధికి నీడ కరువు

● మండుటెండల్లో పని చేస్తున్న కూలీలు

● అందుబాటులో లేని తాగునీరు

● పనుల ప్రదేశాల్లో కనిపించని టెంట్లు



ఎండలో గట్టి నేలను తవ్వుతున్న కూలీలు

**మద్దికెర, ఏప్రిల్ 16:** నీరు లేక మండుటెండల్లో ఉపాధి కూలీలు అష్టకష్టాలు పడుతున్నారు. గత కొద్దిరోజులుగా ఎండలు విపరీతంగా పెరిగిపోవడంతో ఉదయం 9 గంటల నుంచి తీవ్రమైన ఎండవేడిమి, ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఇక ఉపాధి కూలీల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించకపోవడంతో నీడనిచ్చే టెంట్లు, తాగునీరు, ఇతర వసతులకు దూరంగా మండుటెండల్లోనే పనులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని కూలీలు వాపోతున్నారు. మద్దికెర మండలంలో మొత్తం 11 గ్రామాలున్నాయి. దాదాపు 750 గ్రూపులకు 10వేలకు పైగా జాబ్‌కార్డులు ఉన్నాయి. మండలంలో మట్టి రోడ్లు, కత్తువులు, ఫారంపండ్స్ పనులకు ఉపాధి కూలీలు వెళ్తున్నారు. వీరిలో ఎండలో తీవ్రతకు అలసటకు గురైనా, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు ప్రథమ చికిత్స కిట్లు, టెంట్లు, ఓఆర్ఎస్, తాగునీరు అందుబాటులో ఉండాలి. అయితే.. ఆ ప్రదేశాల్లో కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదు. కూలీలే ఇంటి నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. ఈ విషయంపై ఏపీవో నర్సిరెడ్డిని వివరణ కోరగా.. "ఉపాధి కూలీలు ఉదయం, సాయంత్రం రెండు పూటలు పని చేసుకోవచ్చు. ఎండ తీవ్రత కాకముందే ఇళ్లకు వెళ్లాలి. టెంట్లు మంజూరు కాలేదు. కూలీలకు సంబంధించిన వేతనాలు మంజూరు కావాలని అన్ని వివరాలు పొందుపరిచి పంపాం"అని వివరణ ఇచ్చారు.



ఎండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



ఎమ్మిగనూరు అభివృద్ధి అంటే గుర్తుకొచ్చే పేరు దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి. ప్రజల్లో హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న వ్యక్తి బీవీ. పట్టణంలో, పల్లెల్లో బీవీ అభివృద్ధి ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. చేనేతల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేశారు. బీవీ వారసుడిగా రాజకీయాల్లో అడుగు పెట్టిన మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తండ్రి చూపిన బాటలో అభివృద్ధి అజెండాగా ముందుకు వెళ్తున్నారు. ఒకసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తేనే చేనేతలకు టెక్స్‌టైల్ పార్కు, ఆర్డీఎస్ కుడి కాలువ, ఎమ్మిగనూరు పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్, వెటర్నరీ పాలిటెక్నిక్ కాలేజీ, బాలికల ప్రభుత్వ జూనియర్ కాలేజీ, పట్టణ పేదలకు ఏపీ టిడ్కో ఇళ్లు, గోనెగండ్ల మండలంలో సమగ్ర గ్రామీణ తాగునీటి పథకం ద్వారా 11 గ్రామాలకు తాగునీటి పథకం.. వంటి శాశ్వత ప్రగతి పనులకు శ్రీకారం చుట్టిన బీవీ జయనాగేశ్వరరెడ్డి ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చుదిద్దుతానని అంటున్నారు. ప్రజా సేవలో మమేకమైన తనకు ఈ ప్రాంతం సమస్యలు.. ప్రజల కష్టాలు బాగా తెలుసని, టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం జూన్ 4 తరువాత కొలువుదీరనుందని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధిలో ఎమ్మిగనూరును ఆదర్శంగా తీర్చుదిద్దుతా.. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసి చేనేతలకు ఉపాధి కల్పిస్తా.. ఆర్డీఎస్ కుడి కాలువ పూర్తి చేస్తా.. అదనపు ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణానికి కృషి చేసి, ఇంటింటికి కుళాయి, ప్రతి ఇంటా సూపర్ సిక్స్ పథకాలు ద్వారా పేదలను లక్షాధికారులను చేసే బాధ్యత తీసుకుంటాను అంటున్న టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాల్లోకి వెళితే..

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



# అభివృద్ధే లక్ష్యం





- ఎమ్మిగనూరును ప్రగతిపథంలో నడిపిస్తా
- చేనేతల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రణాళిక
- టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుతో చేనేతలకు ఉపాధి
- ఆర్డీఎస్ కుడి కాలువతో ఈ ప్రాంతం సస్యశ్యామలం
- పట్టణ తాగునీటి కోసం గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్
- ఎమ్మిగనూరు పట్టణ విస్తరణ దృష్ట్యా రింగ్ రోడ్డు నిర్మాణం
- పల్లెసీమల్లో ఇంటింటికి కుళాయి, సీసీ రోడ్డు, డ్రైనేజీలకు తొలి ప్రాధాన్యత
- ఎమ్మెల్యేగా గెలవగానే 3,500 టిడ్కో ఇళ్లు పంపిణీ



ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

**● ప్రచారం జోరు పెంచారు.. ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది..?**

● **బీవీ** : ఎమ్మిగనూరు పట్టణం సహా ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లో ఏ పల్లెకు వెళ్లినా ప్రజలు ఎంతో ఆప్యాయంగా ఆదరిస్తున్నారు. అన్నా..! మీరు ధైర్యంగా ఉండడండి.. ఈ జగన్‌ను ఇంటికి పంపించే బాధ్యత మాది. వైసీపీ అరాచకాలు పోవాలి.. రాష్ట్రం బాగుపడాలి అంటే చంద్రబాబు రావాలని ప్రజలు అంటున్నారు. మీరు నిశ్చింతగా ఉండండి... మిమ్మల్ని గెలిపించుకునే బాధ్యత మాది అంటూ జనమే మాకు గెలుపు భరోసా ఇస్తున్నారు. బీవీ కుమారుడిగా గుండెల్లో పెట్టుకున్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న బీవీ జయనాగేశ్వర్ రెడ్డి

- కర్నూలు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి), ఎమ్మిగనూరు

**● ఆంధ్రజ్యోతి ప్రతినిధి : టీడీపీ అభ్యర్థిగా అధినేత చంద్రబాబు మీకు మరో అవకాశం ఇచ్చారు. ఎలా ఫీల్ అవుతున్నారు?**

● **టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి** : చాలా సంతోషంగా ఉంది. 2014 నుంచి ప్రజల మధ్యనే ఉంటున్నాను. అధిష్ఠానం ఏ కార్యక్రమం చేపట్టినా విజయవంతం చేశాను. వైసీపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు ఎండగట్టాం. ఎమ్మిగనూరులో బీవీ జయనాగేశ్వరరెడ్డి గెలుస్తారని వివిధ సర్వేలు చెబుతున్నాయి.

**● పోలింగ్ కౌంట్ డౌన్ మొదలైంది.. ప్రచారం ఎలా సాగుతోంది..?**

● **బీవీ**: ఎన్నికలతో సంబంధం లేకుండానే ఐదేళ్లుగా ప్రజల మధ్యలోనే ఉంటున్నాను. ప్రచారం జోరుగా సాగుతోంది. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది. మీరు మా బీవీ మోహన్‌రెడ్డి కొడుకు.. మిమ్ములను గెలిపించుకునే బాధ్యత మాది. మీరు నిచ్చింతంగా ఉండడండి... అని ప్రజలు అంటుంటే మా నాన్న బీవీ బలమైన పునాది వేశారని తెలుస్తుంది. ఎమ్మిగనూరు పట్టణం, మండలం, నందవరం, గోనెగండ్ల మండలాల్లో పల్లెనిద్ర పేరిట ఇప్పటికే ఒక దఫా ప్రచారం పూర్తి చేశాను. రెండవ విడత ప్రచారానికి శ్రీకారం చుట్టా.

**● దొంగ ఓట్లను అడ్డుకునేందుకు ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తున్నారు..?**

● **బీవీ**: అధికారం అడ్డం పెట్టుకొని వైసీపీ నాయకులు దొంగ ఓట్లు చేర్పించారు. వాటిపై జిల్లా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశాం. వారు కూడా తక్షణమే స్పందించి కొంతవరకు తొలగించారు. పోలింగ్ రోజు మా ఏజెంట్లు దొంగ ఓట్లు పడకుండా గట్టిగా ఎదుర్కొంటారు. ఆ మేరకు టీడీపీ పసుపు సైన్యం సిద్ధంగా ఉంది.

**● వైసీపీ వలంటీర్లను ఉపయోగించుకొని అధికారంలోకి రావాలని చూస్తున్నది. వారిని ఎలా కట్టడి చేస్తారు?**

● **బీవీ** : వలంటీర్లను ఎన్నికల విధులకు ఉపయోగించవద్దని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. మేము వలంటరీ వ్యవస్థకు వ్యతిరేకం కాదు.. వారిని జగన్ కార్యకర్తల్లా ఉపయోగించుకుంటే.. మా అధినేత వారి ఆత్మగౌరవం పెంచేందుకు గౌరవ వేతనం రూ.10 వేలు పెంచుతామని, నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉన్నతంగా వారు ఎదిగేలా తీర్చిదిద్దుతామని స్పష్టమైన హామీ ఇచ్చారు. వలంటీర్లు కూడా ఆలోచించాలి.



వృద్ధురాలికి భరోసా ఇస్తూ...

**ఈ ఎన్నికల్లో విజయం వ్యూహాలు ఏమిటి..?**

● బీవీ : ఎమ్మిగనూరు అంటే బీవీ.. బీవీ అంటే ఎమ్మిగనూరు అనేంతగా మా నాన్న ప్రజలతో అనుబంధం పెంచారు. ఆ అనుబంధమే నా విజయానికి తొలిమెట్టు. ఆ తరువాత రాజకీయ, అభివృద్ధి వ్యూహాలు ఎలాగు ఉంటాయి. భవిష్యత్తుకు గ్యారెంటీ.. బాబు ష్యూరిటీ, మహాశక్తి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ.1,500 (ఒక ఇంట్లో 18 ఏళ్ల పైబడిన వాళ్లు ఎందరుంటే అందరికీ), ఇంట్లో ఎందరు పిల్లలు చదువుతున్నా అందరికీ ఒక్కొక్కరికి రూ.15వేలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, అన్నదాత పథకం కింద రైతుకు ఏడాదికి రూ.20వేలు సాయం, ఇంటింటికి కొళాయి, యువగళం పథకం ద్వారా 20 లక్షల ఉపాధి అవకాశాలు, లేదా రూ.3 వేల నిరుద్యోగ భృతి.. ఇలా సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం చేస్తున్నాం.



**● మీరు ఎమ్మెల్యేగా గెలిచాక చేపట్టబోయే అభివృద్ధికి ఎలాంటి హామీలు ఇస్తారు..?**

బీవీ: 1. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో పోరాడి.. నాటి సీఎం చంద్రబాబును ఒప్పించి రూ.1,986 కోట్లతో ఆర్డీఎస్ కుడి కాలువ పనులు చేపడితే.. వైసీపీ వచ్చాక ఆపేసింది. ఈ పనులు పూర్తి చేసి ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాలకు తాగు, సాగునీరు అందిస్తాను.

- గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల పేదలకు పంపిణీ చేయడం తొలి ప్రాధాన్యత.
- ఎమ్మిగనూరు పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం, అసంపూర్తిగా వదిలేసి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి చేయడం.
- బనవాసి కేంద్రంగా టెక్స్‌టైల్ పరిశ్రమ ఏర్పాటు, చేనేతలకు ఉపాధి కల్పించడం
- పట్టణానికి తాగునీరు అందించేందుకు నేను ఎమ్మెల్యేగా రూ.135 కోట్లతో చేపట్టిన గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ అసంపూర్తిగా వదిలేశారు. ఈ పనులు పూర్తి చేస్తా. అదనపు ఎస్ఎస్ ట్యాంక్ ఏర్పాటుకు కృషి చేస్తా.
- గోనెగండ్లలో టీడీపీ ప్రభుత్వంలో రూ.75 కోట్లతో 17 గ్రామాలకు తాగునీరు అందించే సమగ్ర తక్షిత మంచి నీటి పథకం చేపడితే అసంపూర్తిగా వదిలేశారు. దీనిని పూర్తి చేసి పల్లె దాహం తీరుస్తాను. ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తా.
- ఎమ్మిగనూరు పట్టణం, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లో అర్హత కలిగిన పేదలు అందరికి 2 సెంట్లు ఇంటి స్థలం, పక్కా ఇళ్లు నిర్మిస్తా.
- గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయి, మరుగుదొడ్లు ఏర్పాటు చేయిస్తా.
- ఎమ్మిగనూరు పట్టణం విస్తరిస్తున్న దృష్ట్యా రింగ్ నిర్మాణం కోసం ప్రత్యేక ప్రణాళిక, కార్యాచరణ దిశగా కృషి చేస్తా.
- మంత్రాలయం-కర్నూలు వయా ఎమ్మిగనూరు రైల్వే లైన్ నిర్మాణం కోసం కృషి చేస్తా.
- ఎమ్మిగనూరు - కోడుమూరు వయా గోనెగండ్ల ప్రధాన రహదారిని జాతీయ రహదారిగా అధునికీకరించేందుకు చర్యలు తీసుకుంటా.
- ఎమ్మిగనూరులో రూ.13 కోట్లు వంద పడకల ఆస్పత్రికి నేను ఎమ్మెల్యేగా నిధులు తెప్పించి పనులు చేపడితే.. వైసీపీ వచ్చాక ఐదేళ్లైనా పూర్తి చేయలేదు. దాన్ని ప్రాధాన్యతలో ఉంచుకొని పూర్తి చేస్తాను.

**● పట్టణ వార్డులు.. గ్రామాలు చుట్టేస్తున్నారు.. ప్రజలు ఎలాంటి సమస్యలు వినిపిస్తున్నారు..?**

● **బీవీ** : ఆనాడు మా నాన్న బీవీ.. 2014లో నేను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి పనులు తప్ప వైసీపీ పాలనలో ప్రగతి శూన్యం. పట్టణం, పల్లెల్లో ఎక్కడికి వెళ్లినా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పేదలకు పక్కా ఇళ్లు, ఇంటి స్థలాలు, ముఖ్యంగా ఎల్లెల్సీ చివరి ఆయకట్టు సహా గాజులదిన్నె ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల కింద సాగునీరు అందడం లేదు అనే సమస్యలు ప్రధానంగా ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత ఆందోళన చెందుతోంది.

**● లోకేశ్ పాదయాత్ర సందర్భంగా మీ దృష్టికి వచ్చిన సమస్యలు ఏమిటి? వాటి పరిష్కారం ఎలా?**

● **బీవీ**: యువనేత లోకేశ్‌తో కలసి పల్లెల్లో నడుస్తోంటే చుక్కనీరు లేక తల్లడిల్లుతున్న ప్రజల కష్టాలు కళ్లారా చూశాం. మా గొంతు తపడాలంటూ మహిళలు బిందెలతో వచ్చారు. ఏ ఊరికి వెళ్లినా కరువు.. వలసలు. ఈ సమస్యలకు పరిష్కారం ఒక్కటే. ఆనాడు అసెంబ్లీలో పోరాడి.. నాటి సీఎం చంద్రబాబును ఒప్పించి రూ.1,986 కోట్లతో ప్రారంభించిన ఆర్డీఎస్ కుడి కాలువ పూర్తి చేయడమే. వైసీపీ వచ్చాక పనులు ఆగిపోయాయి. నేను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ప్రాధాన్యత క్రమంలో ఆర్డీఎస్ కాలువ పూర్తి చేసి సాగు, తాగునీరు అందిస్తాను. మట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాకు గోదావరి జలాలు ఇస్తే.. కృష్ణా జలాలు శ్రీశైలం నుంచి సీమకు మళ్లించిన ఘనత టీడీపీదే. అందులో భాగంగా హంద్రీ నీవా నుంచి గాజులదిన్నె ప్రాజెక్టుకు 4 టీఎంసీలు మళ్లించేందుకు చంద్రబాబు జీవో ఇచ్చారు. జీడీపీ కుడి ఎడమ కాల్వల ఆయకట్టుకు సాగు, ఎమ్మిగనూరు పట్టణానికి తాగునీరు ఇవ్వడమే ఆ జీవో లక్ష్యం. వైసీపీ ప్రభుత్వం ఈ ఏడాది 1.5 టీఎంసీలు కూడా తీసుకోలేదు. ఇది దుర్మార్గం కాదా..?

**● ఎమ్మిగనూరు అంటేనే చేనేత పురి అంటారు.. వారి అభ్యున్నతికి ఎలా కృషి చేస్తారు..?**

● **బీవీ**: టీడీపీ డీఎన్ఏ బీసీ. బీవీ కుటుంబం గుండెల్లో చేనేతలు ఉన్నారు. నాడు మా నాన్నను.. నేడు నన్ను తమ బిడ్డలా ఆదరించారు చేనేత కార్మికులు. అందుకే నేను ఎమ్మెల్యేగా బనవాసి వద్ద టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టి వంద ఎకరాలు భూమి, నిధులు కేటాయించా. పట్టణంలో మూడు చేనేత క్లస్టర్లు ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశా. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటిని గాలికి వదిలేసింది. వచ్చేది టీడీపీ ప్రభుత్వమే. యువనేత నారా లోకేశ్ మంగళగిరిలో చేనేతల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న పైలెట్ ప్రాజెక్టు సక్సెస్ అయింది. దానికి ఎమ్మిగనూరుకు తీసుకొస్తాను. బీసీ డిక్లరేషన్‌లో భాగంగా చేనేతలు సహా బీసీలు ఆర్థికంగా ఎదిగేందుకు ఏ అవకాశాన్నీ వదులుకోను. 50 ఏళ్లు దాటిన బీసీలకు రూ.4 వేలు పింఛన్ ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. ప్రతి బీసీ, చేనేత కుటుంబానికి పింఛన్ అందేలా కృషి చేస్తాను. మగ్గం ఉన్న ప్రతి చేనేతకు నేతన్న నేస్తం, ఉచిత కరెంట్ అందిస్తాం. ముఖ్యంగా టెక్స్‌టైల్ పరిశ్రమ తీసుకొచ్చి చేనేతల్లో ఉపాధి అవకాశాలు పెంచి ఆర్థికంగా ఎదిగేలా చేస్తాను. ఆనాడు ఏ లక్ష్యంతో దివంగత పద్మశ్రీ మాచాని సోమప్ప చేనేత రంగాన్ని అభివృద్ధి చేశారో.. అదే స్ఫూర్తితో చేనేతలకు అండగా ఉంటాను.

**● వాటి పరిష్కారానికి మీ వద్ద ఉన్న ప్రణాళిక ఏంటి ?**

● **బీవీ** : సమస్యలపై అవగాహన ఉంది. వాటిని పరిష్కరించే ప్రణాళిక కూడా ఉంది. ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలవడం ఖాయం. అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తాను. మా నాన్న బీవీ అభివృద్ధికి నాంది పలికారు. ఎక్కడికి వెళ్లినా ఆయన చేసిన అభివృద్ధి ఫలాలే కనిపిస్తున్నాయి. గురురాఘవేంద్ర ప్రాజెక్టు, నవోదయ విద్యాలయం, బనవాసి గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీ, ఎస్ఏపీ తాగునీటి పథకాలు, పట్టణంలో పురపాలక కార్యాలయం, కమ్యూనిటీ హాల్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో. పల్లెపల్లెన బలహీనవర్గాల కాలనీలు, ఎమ్మిగనూరు పట్టణంలో ఎన్టీఆర్ నగర్, షైనార్డీ కాలనీ, శివన్న నగర్ పేరిట ఊళ్లే నిర్మించి పేదలకు రూ.లక్షలు విలువైన ఆస్తి ఇచ్చారు. 2014లో నన్ను ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. రూ.1,986 కోట్లతో ఆర్డీఎస్ కుడి కాలువ, పట్టణానికి తాగునీటి సమస్యే లేకుండా చేసేందుకు రూ.145 కోట్లతో గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపుపైల్, గోనెగండ్ల మండలంలో రూ.13 కోట్లతో సమగ్ర గ్రామీణ తాగునీటి పథకం పేరిట 11 గ్రామాలకు తాగునీటి పనులు చేపడితే వైసీపీ వచ్చాక ఆపేశారు. ఎన్నికలు వచ్చాయని మరో ఐదు గ్రామాలు చేర్చి టెంకాయ కొట్టారు. ఇంతకంటే మోసం ఉంటుందా?

వెటర్నరీ పాలిటెక్నికల్ కాలేజీ, పట్టణంలో రోడ్లు అదునికీకరణ.. ఇలా ఎన్నో చేశాను. అదే స్ఫూర్తితో పక్కా ప్రణాళికతో ఎమ్మిగనూరును ఆదర్శంగా తీర్చిదిద్దుతాను.



తాగునీటి సమస్యపై మాట్లాడుతున్న బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

**● ఆంధ్రజ్యోతి : టీడీపీ అధినేత ఇస్తున్న భవిష్యత్తుకు గ్యారెంటీ.. బాబు ష్యూరిటీపై ఎలాంటి స్పందన ఉంది...?**

● **బీవీ** : మహిళాలోకం నుంచి ఊహించని స్పందన వస్తున్నది. చంద్రబాబు సీఎం అయితేనే మహిళల ఆర్థిక ప్రగతి సాధ్యమని భావిస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు దగ్గరయ్యాయి. పేదలు ధనవంతులు కావాలంటే చంద్రబాబు సీఎం కావాలని ప్రజలు విశ్వసిస్తున్నారు.

**● రాజకీయాల్లోకి రావడానికి స్ఫూర్తి ఎవరు.. ఎందుకు రావాలనుకున్నారు..?**

● **బీవీ** : మా నాన్న బీవీ మోహన్‌రెడ్డి రాజకీయాల్లోకి రావడానికి టీడీపీ వ్యవస్థాపకులు నటరత్న నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) స్ఫూర్తి అయితే.. నాకు మా నాన్న స్ఫూర్తి. నాన్నే నాకు రోల్ మోడల్. మా అధినేత, చంద్రబాబు మరింతగా ప్రోత్సాహం అందించారు.

**● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలను సమన్వయం చేసుకుంటూ ఎలా ముందుకు వెళ్తారు..?**

● **బీవీ** : మా నియోజకవర్గంలో ఎలాంటి సమస్య లేదు. సమన్వయంతో ముందుకు వెళ్తున్నాం. మా కూటమి ఏకైక లక్ష్యం ఈ జగన్‌ను ఇంటికి పంపించడం.. విధ్వంస పాలనకు స్వస్తి చెప్పడం. టీడీపీ సారథ్యంలో రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు చేయడం. ఆ దిశగా సమన్వయంతో ముందుకు వెళ్తున్నాం.



మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

**● మీ కుటుంబ రాజకీయ నేపథ్యం వివరిస్తారా..?**

● **బీవీ** : మాది సామాన్య కుటుంబం. 1982లో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారు. మా నాన్న బీవీ మోహన్‌రెడ్డికి ఎన్టీఆర్ కుటుంబంతో ఉన్న సన్నిహితం, అనుబంధంతో 1983లో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి పోటీ చేయించారు. ఆనాడు ఎన్టీఆర్ చరిష్మాతో మా నాన్న ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఎన్టీఆర్ క్యాబినేట్‌లో మంత్రి పదవి చేపట్టారు. అలా ఎమ్మిగనూరు రాజకీయాల్లో అడుగు పెట్టిన మా నాన్న నియోజకవర్గం ప్రజల సేవలో మమేకమై 1999 వరకు ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా విజయం సాధించి ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రివర్గం కీలకమైన క్యాబినేట్ మంత్రి పదవులు చేపట్టారు. 2012లో జరిగిన ఉప ఎన్నికల వరకు ఆయన ఎమ్మిగనూరు ఎన్నికల బరిలో ఉన్నారు. నాన్న మరణాంతరం ఆయన వారసుడిగా రాజకీయాల్లోకి నేను అడుగు పెట్టాను. 2014లో తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి ప్రజల ఆశీర్వాదంతో గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టాను. 2019లో ఓటమి చెందినా.. కుంగిపోలేదు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రజల మధ్యనే ఉన్నాను. మా అధినేత చంద్రబాబు మళ్లీ నాకు అవకాశం ఇచ్చారు. ఈ ఎన్నికల్లో మా గెలుపు తథ్యం. సర్వేలు కూడా అదే చెబుతున్నాయి.

**● మీ బాల్యం.. విద్యా, వివాహం, కుటుంబం వివరాలు చెబుతారా.. పాఠకుల కోసం**

● **బీవీ** : నా బాల్యం అంతా అనంతపురంలో గడిచింది. 1 నుంచి 10వ తరగతి వరకు అక్కడే లాల్ బహదూర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, పల్లె రాఘునాథ్‌రెడ్డి జూనియర్ కాలేజీలో ఇంటర్ బైపీసీ పూర్తి చేశాను. హైదరాబాద్‌లో డక్కెన్ కాలేజీ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. పీజీలో చేయాలనే లక్ష్యంగా ఎండీ రేడియాలజీ కోర్సులో చేరాను. ఆ సమయంలో నాన్న అనారోగ్యం వల్ల ఆయనకు సహాయంగా రాజకీయాల్లో రావడంతో పీజీ మధ్యలో ఆగిపోయింది. ఎన్టీఆర్ ఆదేశాలతో 1983లో నాన్న బీవీ మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు నుంచి తొలిసారిగా పోటీ చేసి విజయం సాధించారు. నాటి నుంచి 40 ఏళ్లకు పైగా ఎమ్మిగనూరులోనే ఉంటున్నాం. ఇదే మా స్వగ్రామం. మా అమ్మ నాగమణెమ్మ. భార్య బైరెడ్డి నిత్యాదేవి, కూతురు బైరెడ్డి యుభాషిణి. ఇదీ మా కుటుంబం.

